ఫ్యూచర్ సిటీని ఆపండి.. తెలంగాణను కాపాడండి!

- ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో మరో ఉద్యమం
- ఒక్క కలంపోటుతో స్వయంపరిపాలనహక్కులు కోల్పోనున్న 56 గ్రామాలు
- ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ నాయకురాలు కావుల సరస్వతి

రంగారెడ్డి, మే 2 (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్‌సిటీని ఆపాలని.. తెలంగాణను కాపాడాలని ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో త్వరలో మరో ఉద్యమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలో గత ప్రభుత్వం ఏర్పాటు చేయాలనుకున్న ఫార్మాసిటీ స్థానంలో ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్‌సిటీని ఏర్పాటు చేస్తామని ప్రకటించడంతో పాటు ఫార్మాసిటీ కోసం సేకరించిన భూమిని ఫ్యూచర్‌సిటీకి కేటాయించడం చట్ట విరుద్ధమని, ఫార్మాసిటీ కోసం చట్ట ప్రకారం పర్యావరణ అనుమతులు తీసుకుని సేకరించిన భూమిని మరో ప్రయోజనం కోసం మళ్లించడం చట్టరీత్యా చెల్లదని... ఆ భూమిని తిరిగి రైతులకే ఇవ్వాలనే నినాదంతో ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నాలు సాగుతున్నాయి. రంగారెడ్డి జిల్లాలోని కందుకూరు, యాచారం మండలాల్లో గత ప్రభుత్వం ఫార్మాసిటీ కోసం భూసేకరణ చేసింది. కానీ, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఫార్మాసిటీని రద్దుచేశామని, అందులో ఫ్యూచర్‌సిటీని కడుతున్నామని చెబుతున్నది. చట్టప్రకారం నిర్దిష్ట ప్రయోజనాల కోసం పర్యావరణ అనుమతులు తీసుకున్న భూమిని ఆ ప్రయోజనం కోసమే కేటాయించాలి. మరో ప్రయోజనం కోసం మళ్లించడం చట్టరీత్యా చెల్లదు. అలాంటి భూమిని తిరిగి రైతులకే అప్పగించాలి. కానీ, ఆ భూమిని మరో ప్రయోజనాల కోసం కేటాయించినట్లయితే గ్రామసభల ద్వారా మళ్లీ ప్రజల ఆమోదం తీసుకుని, ఆ తర్వాత మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్టుకు సూచించి శాస్త్రీయ అభిప్రాయం తీసుకొని, కొత్తగా పర్యావరణ అనుమతులు పొందాలి. అవేమీ చేయకుండా ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూముల్లో ఫ్యూచర్‌సిటీకి మళ్లించడం సాధ్యం కాదు. అలాగే, కొత్తగా భూములను తీసుకోవాలనుకున్నప్పుడు ప్రజల సమ్మతితో అదనంగా భూములు సేకరించాలి. నిజానికి ఫార్మాసిటీ ప్రాజెక్టును నిలిపివేసినట్టు ప్రభుత్వమే చెబుతున్నది. ఈ నేపథ్యంలో ఫార్మాసిటీ కోసం తీసుకున్న పర్యావరణ అనుమతులను సస్పెండ్ చేయాలి. కొత్త ఈసీ కోసం మళ్లీ దరఖాస్తు చేయాలి. కానీ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు అలాంటి పనులు చేయలేదు. ప్రజల అనుమతులు లేకుండా ఫ్యూచర్‌సిటీ డెవలప్‌మెంట్ అథారిటీని స్థాపించింది. ఇది చట్టరీత్యా సమంజసం కాదు. ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన ఈ మండలాల్లోని గ్రామప్రజలను వారి సమ్మతి లేకుండా, వారి అభిప్రాయం తీసుకోకుండా, ఫ్యూచర్‌సిటీ పరిధిలోకి తెస్తున్నారు. ప్రజాపాలన తీసుకువస్తామని ప్రమాణం చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్థానిక ప్రజల నిరసనలను పూర్తిగా విస్మరిస్తూ, వారి గొంతులను నొక్కుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ వ్యవసాయ భూముల్లో బలవంతంగా కంచె వేసినట్టు కమిటీ సభ్యులు వాపోతున్నారు. ఏప్రిల్ 3 నుంచి యాచారం మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో వందలమంది పోలీసులను మోహరించి, రైతులను బెదిరించి కంచె వేస్తున్నారని వాపోతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసులు, రెవెన్యూ అధికారులపై త్వరలో కోర్టు ధిక్కరణ కేసులు వేయటానికి రైతులు సిద్ధమవుతున్నారు.

ఫ్యూచర్‌సిటీకి మళ్లించటం చెల్లదు

చట్ట ప్రకారం ఒక్క నిర్దిష్టమైన ప్రయోజనం కోసం పర్యావరణ అనుమతులు తీసుకున్న భూమిని మరొక ప్రయోజనం కోసం దారిమళ్లించటం చట్టరీత్యా చెల్లదు. నేరం కూడా. ఇలాంటి చర్యలు తీసుకోవాలంటే చట్ట ప్రకారం తగు విధివిధానాలను అనుసరించాలి. కొత్తగా ఎన్విరాన్‌మెంట్ రిపోర్టు, వివరణాత్మకమైన ప్రాజెక్టు రిపోర్టులు ప్రజల ముందు ఉంచాలి. పబ్లిక్ హియరింగ్‌లు, గ్రామ సభల ద్వారా ప్రజల ఆమోదం తీసుకోవాలి. ఆ తర్వాత శాస్త్రీయ అభిప్రాయం తీసుకుని కొత్తగా పర్యావరణ అనుమతులు పొందాలి. ప్రజల సమ్మతితో మాత్రమే అదనపు భూమిని సేకరించాలి. ఈ నిబంధనలను పాటించకుండా భూమిని మరో ప్రాజెక్టుకు బదలాయించటం చట్ట రీత్యా నేరం. ప్రభుత్వం తీసుకున్న చట్ట వ్యతిరేక విధానాలపై త్వరలో కోర్టును ఆశ్రయిస్తాం. అలాగే, గ్రామాల స్వయం పరిపాలన హక్కులను కాలరాస్తున్న విధానాన్ని కూడా కోర్టుకు వివరిస్తాం. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ వేసిన కంచెను కూడా తొలగించాలనే ప్రధాన డిమాండ్లతో ముందుకెళ్తాం. ఫ్యూచర్‌సిటీకి వ్యతిరేకంగా త్వరలో చేపట్టబోయే పోరాటం కోసం రైతులను కూడా ఉద్యమానికి సమాయత్తం చేస్తాం.

– సరస్వతి, ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ కన్వీనర్

నాడు సంఘీభావం.. నేడు రైతులపై ఉక్కుపాదం...

బీఆర్ఎస్ హయాంలో ఫార్మాసిటీ కోసం భూములు సేకరించినప్పుడు... ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరులు భూసేకరణ చట్ట విరుద్ధమని వాదించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఫార్మాసిటీని రద్దు చేస్తామని, రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి ఇప్పుడు మాట తప్పారు. ఫార్మాసిటీని రద్దుచేసి ఆ భూములను రైతులకు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా పొందుపరిచింది. కానీ, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల గోడు పట్టించుకోవటం లేదు. మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫార్మాసిటీని రద్దుచేశామని, దాని స్థానంలో ఫ్యూచర్‌సిటీని స్థాపిస్తామని బహిరంగంగా చెబుతున్నారు. ఫార్మాసిటీ పేరుతో సేకరించిన భూమిని ఫ్యూచర్‌సిటీకి బదలాయించటమే కాకుండా అదనంగా మరో 30 వేల ఎకరాల సారవంతమైన వ్యవసాయ భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధం కావాల్సిందిగా కమిటీ పిలుపునిచ్చింది.

అధికారం ప్రభుత్వాలకు లేదు. మేడిపల్లి, నానక్‌నగర్, కుర్మిద్ద, తాటిపర్తి గ్రామాల నుంచి సుమారు వెయ్యిమంది రైతులు భూసేకరణను సవాల్ చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. భూములను రైతుల నుంచి బలవంతంగా తీసుకోవద్దని కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చింది. అలాగే, భూములు లేని కూలీలు, రైతుల సమ్మతి లేకుండా అసైన్డ్, సీలింగ్ వంటి భూములను కూడా తీసుకోవద్దని ఆదేశాలు జారీచేసింది. దీంతో మేడిపల్లి, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాలు పూర్తిగా స్టే ఆర్డర్ కింద ఉన్నాయి. అయినప్పటికీ రేవంత్ సర్కారు కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ చుట్టూ ఫెన్సింగ్ వేసింది. ఆన్‌లైన్ రికార్డుల్లో రైతుల పేర్లను పునరుద్ధరించాలని, రైతులకు పంటరుణాలు, రైతుబంధు ఇవ్వాలని కోర్టు ఆదేశించినప్పటికీ వాటిని కూడా పట్టించుకోవటం లేదని అన్నదాతలు వాపోతున్నారు.

స్వయంపాలనా హక్కుపై వేటు...

ఫ్యూచర్‌సిటీ పేరిట ప్రభుత్వం చేస్తున్న చర్యల కారణంగా ఒక్క కలంపోటుతో 56 గ్రామాల స్వయంపరిపాలన హక్కులు కోల్పోతున్నాయి. ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన ఇక్కడి ప్రజలు వారి సమ్మతి లేకుండానే, వారి అభిప్రాయం తీసుకోకుండానే ఫ్యూచర్‌సిటీలోకి నెట్టివేయబడుతున్నారు. ఫ్యూచర్‌సిటీ అథారిటీ చెప్పింది వినాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రజల హక్కులు హరించే

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, రచయిత శ్రీధర్‌రావుదేశ్‌పాండే, మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు ప్రభాకర్, మాణిక్‌రావు, నాయకులు వీ ప్రకాశ్, దేవీప్రసాద్, అయాచితం శ్రీధర్, కే సీతారామారావు తదితరులు

కాళేశ్వరమే రేపటి తెలంగాణ జీవధార

- కేసీఆర్‌కు పేరొస్తదనే ప్రాజెక్టును బలిపెడుతున్నరు
- రాజకీయ లబ్ధి కోసమే సీఎం రేవంత్ దుష్ప్రచారం
- ప్రాజెక్టును పునరుద్ధరించాలి
- రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి
- మాజీ మంత్రి హరీశ్ డిమాండ్
- కాళేశ్వరంపై దేశ్‌పాండే రచించిన పుస్తకావిష్కరణ
- అద్భుత విజయాలను సాధించాం: నిరంజన్‌రెడ్డి
- మళ్లీ జలసాధన పోరాటాలు చేయాలి: ప్రకాశ్

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రిగా కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రేపటి తెలంగాణ జీవధార అని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఆ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రచారమంతా పచ్చి అబద్ధమని మండిపడ్డారు. రాజకీయ లబ్ధికోసమే ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని, రైతాంగం ప్రయోజనాలను బలిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రాజెక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాగునీటిరంగ నిపుణులు శ్రీధర్‌రావు దేశ్‌పాండే రచించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు : ప్రశ్నలు–విమర్శలు –వక్రీకరణలు–వివరణలు' 'సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో కొనసాగింది. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న వక్రీకరణలను, ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ పార్టీ సాగునీటి రంగాన్ని దెబ్బతీసిన విధానాలను ఈ సందర్భంగా హరీశ్‌రావు తీవ్రంగా ఎండగట్టారు. కేసీఆర్ నేతృత్వంలోని పదేండ్ల బీఆర్ఎస్ పాలనంలో తెలంగాణ సాగునీటి విజయ ప్రస్థానాన్ని గుర్తుచేశారు. కమిషన్లు, కమిటీల పేరిట ప్రభుత్వం ముప్పేట దాడిచేస్తున్న ఈ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను, తెలంగాణకు ప్రాజెక్టు ఎంత అవసరమో వివరిస్తూ పుస్తకాలను తీసుకొచ్చిన రచయిత శ్రీధర్‌రావును దేశ్‌పాండేను అభినందించారు. తెలంగాణపై ఆయన మమకారం, ప్రేమ.. తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు పారాలన్న తండ్లాటకు ఈ పుస్తకాలే నిదర్శమని కొనియాడారు.

కేసీఆర్‌పై రాజకీయ కక్ష

కాళేశ్వరం నిలబడితే, ఆ మంచి పనిని కొనసాగిస్తే కేసీఆర్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారనే సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్ష పెంచుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రైతుల ప్రయోజనాలను, రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టి రేవంత్‌రెడ్డి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తాగునీటి రంగంలో కేసీఆర్ వందేండ్ల ముందుకు ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నారని, అందుకు కాళేశ్వరమే నిదర్శమని వివరించారు. నాడు తట్ట మట్టి తీయకుండా రూ.వేల కోట్లను దోచుకున్న కాంగ్రెస్సే నేడు అవినీతి అంటూ మాట్లాడుతున్నదని నిప్పులు చెరిగారు. తన పుట్టినరోజు నాడు కూడా మహారాష్ట్రకు వెళ్లి తెలంగాణ ప్రయోజనాలను, అవసరాలను వివరించి ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. సీడబ్ల్యూసీ సూచనలు, విశ్రాంత ఇంజినీర్ల నివేదికలు ఇలా అన్నివిధాలుగా ఆలోచించి తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టును మేడిగడ్డను మార్చారని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ కడితే గ్రావిటీ ద్వారా నీరు వచ్చేవని మాట్లాడటం అవివేకమని, అక్కడ కూడా ఎల్లంపల్లి వరకు లిఫ్ట్ ద్వారానే వస్తాయని తెలిపారు. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు ఆయకట్టు 16 లక్షలు మాత్రమేనని, నీటినిల్వ సామర్థ్యం 16 టీఎంసీలేనని, కాళేశ్వరం ప్రాజెక్టుతో 37 లక్షల ఎకరాలకు నీరందనున్నదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 141 టీఎంసీల నీటిని నిలువ చేసే రిజర్వాయర్లను కేసీఆర్ కట్టారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నదని, వాటిని పుస్తకం ద్వారా శ్రీధర్ దేశ్‌పాండే తిప్పికొట్టారని, వాస్తవాలను బయటపెట్టారని తెలిపారు. కాళేశ్వరం కూలిందని దుష్ప్రచారం చేస్తూనే మరోవైపు ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని తరలించేందుకు రేవంత్‌రెడ్డి సర్కారు టెండర్లను పిలిచిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అజ్ఞానంతో మాట్లాడి విలువ తీసుకోకుండా సోయి తెచ్చుకోవాలని చురకలంటించారు. 2014 జూలైలోనే నాటి కేంద్ర నీటివనరుల శాఖ మంత్రి ఉమాభారతిని కలిసి కృష్ణానదీ జలాల పునఃపంపిణీ జరగాలని కేసీఆర్ పట్టుబట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి ప్రధానమంత్రిని కలిసి, వినకపోతే సుప్రీంకోర్టులో కేసు కూడా వేశారని, సుదీర్ఘకాలం పోరాడి తుదకు సెక్షన్ 3ని సాధించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. తెలంగాణకు శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారని కొనియాడారు.

నీటికోసమే తెలంగాణ ఉద్యమం: నిరంజన్‌రెడ్డి

తెలంగాణ ఉద్యమం నీళ్ల కోసమే, నీళ్ల చుట్టూనే కొనసాగిందని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు జిల్లాలో అద్భుతాలను చేశామని వివరించారు. కాంగ్రెస్ సర్కార్ రాకతో మళ్లీ గతం పునరావృతమవుతున్నదని, చెరువులు ఎండిపోతున్నాయని ధ్వజమెత్తారు. సాగునీటిరంగ నిపుణులు వీ ప్రకాశ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. రాజకీయ కక్షతో ప్రాజెక్టును పడావు పెడుతున్నదని తెలిపారు. మళ్లీ జలసాధనకు కోసం తెలంగాణ ఉద్యమించాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. కార్యక్రమంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, అంబేద్కర్ వర్సిటీ మాజీ వీసీ కే సీతారామారావు, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రిటైర్డు ఇంజినీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి టీ వెంకటేశం, సీనియర్ జర్నలిస్టు పీ వేణుగోపాలస్వామి, తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.

కృష్ణా జలాల్లో వాటా కోసం పోరాడాలి

- 90 శాతం పూర్తయిన పాలమూరు ప్రాజెక్టు
- మిగతా 10 శాతం పూర్తికి రెండేండ్లు ఎందుకు?
- రైతు రుణమాఫీ సగం కూడా కాలేదు
- రైతులకు ఇచ్చిన బోనస్ ఎంత? కొన్న ధాన్యం లెక్కలు చెప్పాలి
- కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ) : కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పోరాడాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సూచించారు. పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు పనులు 90శాతం పూర్తయ్యాయని మెచ్చుకున్న నీటిపారుదల శాఖ మంత్రికి.. మిగిలిన 10శాతం పనుల పూర్తికి మరో రెండేండ్ల సమయం ఎందుకు పడుతుందని నిలదీశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రాజెక్టులపై కేవలం సమీక్షలు చేస్తే సరిపోదని దుయ్యబట్టారు. సాగదీత కోసమే నీటిపారుదల శాఖ మంత్రి పాలమూరులో పర్యటిస్తున్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో పాలమూరు ఎత్తిపోతల పథకంలో తట్టెడు మట్టి తీసిన పాపాన పోలేదని మండిపడ్డారు. పాలమూరు బిడ్డగా చెప్పుకునే సీఎం రేవంత్‌రెడ్డి.. ఆ ప్రాంత ప్రాజెక్టుల పనులు చేపట్టకపోవడం సొంతగడ్డకు ద్రోహం చేసినట్టు కాదా? అని సూటిగా ప్రశ్నించారు. ప్యాకేజీ–3లో 8 కిలోమీటర్ల కాలువ మాత్రమే మిగిలిపోయిందని, అది కూడా ఆలస్యమవుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దాని కాంట్రాక్టు ఆంధ్రా పార్టీకి చెందిన వారికి దక్కిందని, బహుశా ఆంధ్రా పాలకుల ఒత్తిడితో ఆలస్యమవుతుందేమోనని అనుమానం వ్యక్తంచేశారు. డిండికి గ్రావిటీ ద్వారా నీరు వస్తుందని, అది కూడా రూ.80 కోట్ల నుంచి రూ.100 కోట్ల మేరకే ఖర్చవుతుందని తాము చెప్తుంటే, దానిని కాంగ్రెస్ సర్కారు పెడచెవిన పెడుతుందని ధ్వజమెత్తారు. పాలమూరు పనులను పక్కనబెట్టి, డిండి పనులను ఎందుకు హడావుడిగా చేపడుతున్నారో అర్థం కావడం లేదన్నారు.

నీళ్లు లేక ఎండుతున్న పంటలు..

సాగునీళ్లు ఇవ్వకపోవడంతో పంటలు ఎండుతున్నాయని నిరంజన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతుభరోసా ఇవ్వకుండా వారిని వేధిస్తున్నారని, రుణమాఫీ సగం మందికి కూడా కాలేదన్న విషయాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెబుతున్న విషయాన్ని సర్కారు గమనంలోకి తీసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ సర్కారు రైతులకు ఇచ్చిన బోనస్ ఎంత? కొన్న ధాన్యం ఎంతో లెక్కలు చెప్పాలని డిమాండ్ చేశారు. మూసీ, హైడ్రాతో రాబడులను ధ్వంసం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.

బ్రిజేశ్ తీర్పుతో తెలంగాణకు నీళ్లు గగనమే..

బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ ఉత్తర్వులను ఈ నెల 7న ఫైనల్ చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో సమావేశం కానున్నదని, అయితే ఈ ఉత్తర్వులపై బీఆర్ఎస్ తరపున అభ్యంతరాలు వ్యక్తంచేశామని నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఈ తీర్పును తెలంగాణ ఒప్పుకుంటే ఆల్మట్టిలో 160 టీఎంసీల నీటిని నిలుపుకొనేందుకు అవకాశం ఉంటుందని, దీంతో తెలంగాణకు నీళ్లు రావడం గగనమే అని, ఫలితంగా జూరాల ప్రాజెక్టు వట్టిపోవడం ఖాయమన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రయోజనాల కోసం పట్టుబట్టాలని ఆయన సర్కారుకు సూచించారు.

కేసీఆర్ పాలనలోనే తెలంగాణ రైజింగ్

సీఎం రేవంత్ మాటలు హాస్యాస్పదం

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజం

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణ రైజింగ్‌గా వెలుగొందిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. నాడు అన్నింటా అగ్రగామిగా ఉన్న రాష్ట్రం ఏడాదిన్నర కాంగ్రెస్ పాలనలో అధోగతి పాలైందని విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ అన్నింటా వెనుకబడిందని మే డే వేడుకల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అబద్ధాలు చెప్పారని మండిపడ్డారు. ఆర్థిక పరిస్థితి బాగాలేదని తెలిసి అలవికాని హామీలు ఎందుకిచ్చారని నిలదీశారు. ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత కాంగ్రెస్ సర్కారుపై ఉన్నదని స్పష్టంచేశారు. లేదంటే ప్రజలు తగిన సమయంలో బుద్ధిచెబుతారని హెచ్చరించారు.

9 నుంచి 11 వరకు యాదగిరిగుట్ట నృసింహుడి జయంత్యుత్సవాలు

- ఈవో వెంకట్రావు వెల్లడి

యాదగిరిగుట్ట, మే 2: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి ప్రధానాలయం, అనుబంధ ఆలయాలైన పాతగుట్ట లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, దుబ్బగుంటపల్లి యోగానంద నరసింహస్వామి ఆలయంలో ఈ నెల 9 నుంచి 11 వరకు స్వామివారి జయంత్యుత్సవాలను వైభవంగా నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట్రావు తెలిపారు. 9న జయంత్యుత్సవాలు ప్రారంభం కానున్నాయని తెలిపారు. 10వ తేదీన నిత్య మూలమంత్ర హవనం, లక్ష పుష్పార్చన, కాళీయమర్ధన అలంకార సేవ, హనుమంత వాహనంపై శ్రీ రామావతారం అలంకార సేవ, 11న ప్రధానాలయంలో మూలమస్త్రహవనం, సహస్ర ఘటాభిషేకం, నృసింహ జయంతి, తీర్థప్రసాద గోష్ఠి నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

తెలంగాణకు తప్పని తాగునీటి కటకట

- అడుగంటిన నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలు
- రెండింట్లో కలిపి ఉన్నది నికరంగా 15 టీఎంసీలే
- తాగునీటికి మాత్రం 25 టీఎంసీలకు పైనే అవసరం
- ఇప్పటికే ఈ ఏడాది 73శాతం జలాలను తరలించిన ఏపీ
- తాజాగా మరో 10 టీఎంసీలు కావాలంటూ డిమాండ్
- 5న కేఆర్ఎంబీ త్రీమెంబర్ కమిటీ సమావేశం

హైదరాబాద్, మే 2 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లపై ఆధారపడినవారు తాగునీటి ఎద్దడిని ఎదుర్కోనున్నారు. రెండింటిలో కలిపి ప్రస్తుతం నికరంగా 15 టీఎంసీల నీరే అందుబాటులో ఉండగా, అవసరాలు మాత్రం దాదాపు 25 టీఎంసీలకుపైనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న జలాల పంపిణీ కోసం సోమవారం త్రీమెంబర్ కమిటీ సమావేశం నిర్వహించాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు లేఖ రాసింది.

తెలంగాణకు తీరని కష్టం..

రిజర్వాయర్లు అడుగంటడంతో తెలంగాణకు తాగునీటికి తండ్లాట తప్పని దుస్థితి నెలకొన్నది. శ్రీశైలం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్‌పాటు ఏడు జిల్లాల తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉంది. సాగర్‌పై హైదరాబాద్ తోపాటు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలు ఆధారపడి ఉన్నాయి. మే, జూన్ నెలల్లో నికరంగా రెండు ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు తాగునీటి కోసం దాదాపు 12–15 టీఎంసీలు అవసరం. కానీ ప్రస్తుతం ఆ మేరకు జలాలు అందుబాటులో లేవు.

ఉన్నది 15 టీఎంసీలే..

నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ 510 అడుగులు కాగా ఆ లెవల్‌లో 131 టీఎంసీలు రిజర్వాయర్‌లో ఉంటాయి. ప్రస్తుతం సాగర్ మట్టం 514 అడుగులకు చేరుకోగా 138 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. అంటే 7 టీఎంసీల జలాలే వినియోగించుకునే అవకాశముంది. ఇక శ్రీశైలం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ 834 ఫీట్లు కాగా, ఆ స్థాయిలో 57 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. అయితే శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం ఇప్పటికే డెడ్‌స్టోరేజీ దిగువకు వెళ్లిపోయింది. ప్రస్తుతం రిజర్వాయర్ లెవల్ 814 ఫీట్లకు చేరుకోగా, డ్యామ్‌లో 37 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ 800 ఫీట్ల నుంచి కూడా జలాలను వినియోగించుకునే వెసులుబాటు ఇరు రాష్ట్రాలకు ఉంది. ఆ స్థాయికి వెళ్లినా అప్పటికి డ్యామ్‌లో 29 టీఎంసీలు ఉంటాయి. అందులో నికరంగా వినియోగానికి అందుబాటులో ఉండే జలాలు 8 టీఎంసీలే. వెరసి రెండు రిజర్వాయర్లలో కలిపి ఇప్పటికి అందుబాటులో ఉన్నది 15 టీఎంసీలు మాత్రమే. ఆవిరి నష్టాలు, రవాణా నష్టాలు పోగా నికరంగా 12 టీఎంసీలకు మించి అందుబాటులో ఉండకపోవచ్చని అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు మే, జూన్ నెలల్లో తాగునీటి కోసం ఇరు రాష్ట్రాలకు కలిపి దాదాపు 22 టీఎంసీల మేరకు అవసరమవుతాయి. అంటే దాదాపు 10 టీఎంసీల జలాలు కొరత ఏర్పడనున్నట్టు తెలుస్తున్నది.

ఇంకా 10టీఎంసీలకు ఏపీ డిమాండ్..

ఈ ఏడాది కృష్ణాబేసిన్‌లో 845 టీఎంసీల మేరకు సముద్రంలో కలిశాయి. సముద్రంలో కలిసిన జలాలు పోగా దాదాపు ఇరు రాష్ట్రాలకు కలిపి 1023కు పైగా టీఎంసీలు ఈ ఏడాది అందుబాటులోకి వచ్చాయి. అందులో ఏపీ ఇప్పటికే తన తాత్కాలిక కోటా 66 శాతానికి మించి 73 శాతం జలాలను తరలించుకుపోయింది. తెలంగాణ తాత్కాలిక కోటా 34 శాతం కాగా, ఆ జలాలను కూడా పూర్తిస